క్లుప్తంగా

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



నవాబుపేట: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని దేపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సంబంధించి మండల అధికారుల బృందం ఆరాతీసింది. ప్రభుత్వం ప్రకటించినట్లు అర్హులకు పథకాలు వస్తాయని ప్రకటించారు. వారి వెంట ఆర్‌ఐ కిరణ్, ఏపీఓ జ్యోతి, దేపల్లి వెంకటేష్ ఉన్నారు.

సామూహిక వ్రతాలు



జడ్చర్ల టౌన్: పట్టణంలోని రమాసహిత సత్యనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిపించారు. సుప్రభాత సేవలతో ప్రారంభమైన వేడుకలు మహాన్యాసపూర్వక విశేష రుద్రాభిషేకం, బిల్వార్చనలు చేసిన అనంతరం వ్రతాలు ఆచరించారు. అనంతరం హోమం మహాపూర్ణాహుతి, చక్రస్నానము, మహాఆశీర్వచనము, తీర్థప్రసాద వితరణ చేశారు.

ఈ నెల 11న పోలింగ్‌స్టేషన్ల ప్రకటన

నవాబుపేట: ఈ నెల 11న ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల ప్రకటన ఉంటుందని ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. దీనికి సంబంధించి శుక్రవారం రాత్రి ఎన్నికల అధికారులు నోటీసులు ఇచ్చారన్నారు. 11న పోలింగ్ కేంద్రాల ప్రకటనచేసిన అనంతరం 13వ తేది వరకు అభ్యంతరాలు స్వీకరణ, 14న రాజకీయ పార్టీలతో సమావేశం, 15న పోలింగ్ కేంద్రాల తుదిజాబితాను అధికారికంగా ప్రకటిస్తామని ఆయన వివరించారు.

బస్సు ఎక్కుతూ జారిపడి..

● మహిళ కాలికి తీవ్ర గాయం

మహమ్మదాబాద్: బస్సు ఎక్కుతూ జారిపడి ఓ మహిళ కాలికి తీవ్రగాయమైన ఘటన శుక్రవారం సల్కర్‌పేటలో చోటు చేసుకున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. మండలంలోని సల్కర్‌పేట బస్ స్టేజీ దగ్గర ఆర్టీసీ బస్సు ఎక్కబోయి జారిపడి నారాయణపేట జిల్లా దామరగిద్దకు చెందిన అంజమ్మ కాలికి తీవ్రగాయమైంది. వెంటనే స్థానికులు 108 వాహనానికి సమాచారమివ్వగా అంబులెన్స్ సిబ్బంది ప్రథమ చికిత్స చేసి మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారును ఢీకొట్టిన డీసీఎం

అడ్డాకుల: మండలంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై కందూర్ స్టేజీ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి ముప్పు తప్పినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. వివరాలు.. వనపర్తి జిల్లా పెద్దమందడికి చెందిన వాకిటి రాకేష్ మరొకరితో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. కందూర్ స్టేజీ సమీపంలో వెనుక నుంచి వచ్చిన డీసీఎం కారును ఢీకొట్టింది. దీంతో కారు వెనుకభాగం దెబ్బతినగా అందులో ఉన్న ఇద్దరు ప్రమాదం నుంచి సురక్షితంగా బయట పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు మధ్యప్రదేశ్‌కు చెందిన డీసీఎం డ్రైవర్ సంగ్రామ్‌బైన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చోరీకి యత్నం.. వ్యక్తికి దేహశుద్ధి



శ్రీనివాస్

కోస్గి రూరల్ : ఆలయంలో దొంగతనానికి వచ్చి స్థానికులకు పట్టుబడిన వ్యక్తిని ప్రజలు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించగా ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ పట్టణంలోని ఇసుకబావి వద్ద ఉన్న చౌడేశ్వరీదేవి ఆలయ సమీపంలో మద్యం సేవించి ఆలయం తాళం పగులగొట్టి చోరీకి పాల్పడుతున్నా క్రమంలో అటుగా వెళ్తున్న కొందరు శివస్వాములు నిలదీశారు. ఈ నేపథ్యంలో స్థానికులు శ్రీనివాస్‌కు దేహశుద్ధి చేసి పోలీసులకు గురువారం రాత్రి అప్పగించారు. పోలీసు విచారణలో ఇతనిపై ఉమ్మడి జిల్లాలోని పలు స్టేషన్లలో కేసులు నమోదైనట్లు తెలిపింది. శుక్రవారం దొంగతనం కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఐదేళ్లలో ప్రజాధనం దుర్వినియోగం

● అద్దె ట్రాక్టర్లతో రూ.80.40లక్షల ఖర్చు
● ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి
● పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



జానంపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్: భూత్పూర్ మున్సిపాలిటీల్లో ఐదేళ్లలో బీఆర్‌ఎస్ నాయకులు అద్దె ట్రాక్టర్లను పెట్టుకొని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం మున్సిపాలిటీలోని 2 ,4, 5, 9, 10 వార్డుల్లో రూ.6జ46లక్షలతో చేపట్టే డ్రైయినేజీలు, సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థానలు చేశారు. అనంతరం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఐదేళ్ల పాటు రెండు అద్దె ట్రాక్టర్లకు ప్రతినెల రూ.1జ30లక్షలు చెల్లిస్తూ రూ.80లక్షలను ట్యాక్స్ రూపకంగా వచ్చే ఆదాయం దుర్వినియోగమైందన్నారు. మున్సిపాలిటీలో ప్రజాధనం దుర్వినయోగం కారాదని ఆలోచనతో పాటు భూత్పూర్ మున్సిపాలిటీని అభివృద్ధి చేయడానికి మూడు ట్రాక్టర్లను రూ.30లక్షల ఖర్చుపెట్టి కొనుగోలు చేసినట్లు తెలిపారు. వాల్యాతండా వద్ద డంపింగ్‌యార్డు రీసైక్లింగ్ చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీలోని వార్డుల్లో ఉన్న మహిళా సంఘాలకు అభయ హస్తం ద్వారా రూ.కోటి విలువ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. అభయ హస్తం ద్వారా మహిళా సంఘాలను బలోపేతం చేసి వారిని అభివృద్ధి దిశలో నడిపించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. మండలంలోని కొప్పెట, మద్దిగట్ల, పోతులమడుగు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయలక్ష్మి, కమిషనర్ నూరుల్ నజీబ్, కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, మండలాధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ మహిళా అధ్యక్షురాలు పద్మ నరేందర్, మాజీ సర్పంచ్ చెన్నమ్మ, నాయకులు గోవర్ధన్‌గౌడ్, నర్సింహులు, నారాయణ, విజయ్‌గౌడ్, సాయి, రాజేశ్‌గౌడ్, వంశీధర్‌గౌడ్, సురేష్, ఆగిరి రవి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి

అడ్డాకుల: సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తమ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండలం జానంపేట విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద శుక్రవారం అడ్డాకుల, మూసాపేట, భూత్పూర్ మండలాలకు చెందిన రైతులకు ఆయన 30 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పంపిణీ చేశారు. తహసీల్దార్ రాజు, శెట్టిశేఖర్, నాగిరెడ్డి, శ్రీహరి, జగదీశ్వర్, బగ్గి కృష్ణయ్య, కృష్ణయ్య, రాజేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నిరంజన్, ఎస్‌టీగౌడ్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తేనే విజయం



విద్యార్థులకు సలహాలు ఇస్తున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు వెంకటేశ్వర్లు ఎలిమశెట్టి

జడ్చర్ల టౌన్: విద్యార్థులు ఒత్తిడిని జయిస్తేనే విజయం సాధిస్తారని వ్యక్తిత్వ వికాస నిపుణుడు వెంకటేశ్వర్లు ఎలిమశెట్టి అన్నారు. శుక్రవారం మండలంలోని కోడ్గల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదివిన విషయాలను గుర్తుంచుకోవటంలో విఫలం కావటానికి కారణాలు వివరించారు. ఏకాగ్రతను పెంచుకొని పరీక్షల్లో మంచి మార్కులు ఏ విధంగా పొందాలో వివరించారు. తల్లిదండ్రులు, పెద్దలను గౌరవిస్తూ బాధ్యతాయుతమైన జీవనశైలి అలవర్చుకుని లక్ష్యంతో ముందుకెళ్లాలన్నారు. ప్రధానోపాధ్యాయులు మారేపల్లి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు షాహీనా పర్వీన్, కృష్ణయ్య, అమరేందర్‌రెడ్డి, శశిధర్, శరణప్ప, కృష్ణ, తాహెర్, అంజలిదేవి, రవికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థినికి బంగారు పతకం



బంగారు పతకం సాధించిన హుమేరాబేగం

మహబూబ్‌నగర్ క్రీడలు: విశాఖపట్నంలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న 2వ ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో జిల్లా కేంద్రానికి చెందిన కింగ్ షోటోకాన్ కరాటేడూ ఇండియా విద్యార్థిని ప్రతిభ కనబరిచినట్లు ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు. శుక్రవారం జరిగిన పోటీల్లో అండర్–10 ఏళ్ల విభాగంలో జిల్లా కేంద్రంలోని అల్‌నూర్ పాఠశాల విద్యార్థి హుమేరాబేగం కటా గ్రీన్‌బెల్టులో బంగారు పతకం సాధించిందన్నారు.

మద్యం తాగి బైక్ నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

నవాబుపేట: మద్యం తాగి బైక్ నడిపిన వ్యక్తికి జైలు శిక్ష పడిందని ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. మండలంలోని సిద్దోటంకి చెందిన వెంకటయ్య అనే వ్యక్తి గత నెలలో నవాబుపేటలో మద్యం మత్తులో బైక్ నడుపుతుండగా పోలీసులు అతన్ని పరీక్షించి మితిమీరిన మద్యం సేవించినట్లు గుర్తించారు. కాగా అతడు అప్పట్లో పరారయ్యాడు. శుక్రవారం అతడిని పట్టుకొని కోర్టుకు తరలించారు. వెంకటయ్య అతిగా మద్యం సేవించడంతోపాటు ఇతరులకు ఇబ్బందులు కలిగించడంతో జడ్జి శశిధర్ అతడికి రూ. 5వేల జరిమానా, రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో రోజు శిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు.

ఆకట్టుకున్న ఎద్దుల బండలాగుడు పోటీలు

విజేతలకు బహుమతుల ప్రదానం



రాచాలలో బండను లాగుతున్న ఎద్దులు

అడ్డాకుల: మండలంలోని రాచాలలో వెలిసిన శ్రీచెన్నకేశవస్వామి దేవాలయం వద్ద బ్రహ్మోత్సవాల చివరి రోజైన శుక్రవారం సాయంత్రం ఏర్పాటుచేసిన ఎద్దుల బండలాగుడు పోటీలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆలయంలో పూజలు చేసి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో నంద్యాల జిల్లా సిరివెళ్లకు చెందిన కందుల రాంభూపాల్‌రెడ్డి ఎద్దులు మొదటి స్థానం(రూ.60వేలు, దాత గౌని మాధవరెడ్డి)లో, నంద్యాల జిల్లా పీఆర్‌పల్లికి చెందిన ఎం.నాగప్ప ఎద్దులు రెండో స్థానం(రూ.50వేలు, దాత బోయపల్లి లక్ష్మీ, కృష్ణయ్య)లో, అనంతపురం జిల్లా పెద్దవడుగూర్ మండలం మేడిమాకులపల్లికి చెందిన తోట తిరుపాల్‌రెడ్డి ఎద్దులు మూడో స్థానం(రూ.40 వేలు, దాత మాల లక్ష్మణ్)లో, నాగర్‌కర్నూల్ జిల్లా తాడూర్ మండలం యాదిరెడ్డిపల్లికి చెందిన డాక్టర్ అఖిలేష్‌రెడ్డి ఎద్దులు నాలుగో స్థానం(రూ.30వేలు, దాత బొక్క బాలయ్య)లో, చిన్నంబావి మండలం పెద్దదగడకు చెందిన ఎం.గోపాలకృష్ణ ఎద్దులు ఐదో స్థానం(రూ.20వేలు, దాత రోకులమోని రాములు, విజయ్‌యాదవ్)లో నిలిచాయి. అనంతపురం జిల్లా గార్లదిన్నెకు చెందిన కె.రామాంజనేయులు రెండు జతల ఎద్దులకు రూ.8వేల చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు. విజేతలకు నగదు బహుమతి దాతలు గౌని మాధవరెడ్డి, బోయపల్లి లక్ష్మీ, కృష్ణయ్య, మాల లక్ష్మన్, బొక్క బాలయ్య, రోకులమోని రాములు, విజయ్‌యాదవ్‌లు నగదును ఎద్దుల యాజమానులకు అందజేశారు.ఆలయ ధర్మకర్త గవిని చెన్నారెడ్డి, మాజీ సర్పంచ్ తిరుపతయ్య, రవీందర్‌రెడ్డి, చక్రధర్‌రెడ్డి, రాఘవరెడ్డి, శ్రీనివాసులు, రాము, జగన్ గ్రామస్తులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల విజేత మూలమల్ల

శ్రీచెన్నకేశవస్వామి దేవాలయం వద్ద స్వామి వారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటుచేసిన ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం ముగిశాయి. 32జట్లు పాల్గొన్న పోటీల్లో ఆత్మకూర్ మండలం మూలమల్ల జట్టు రాచాల జట్టుపై గెలపొంది విజేతగా నిలిచింది. పెద్దకడుమూర్, కురుమూర్తి జట్లు మూడు, నాలుగో స్థానంలో నిలిచాయి. విజేతలకు మొదటి, రెండు, మూడు, నాలుగో బహుమతులుగా రూ.25వేలు, రూ.15వేలు, రూ.8వేలు, రూ.4వేల నగదును అందజేశారు.

సనాతన ధర్మ పరిరక్షణకు పాటుపడుదాం



ఊట్కూరు: సనాతన ధర్మ పరిరక్షణకు పాటుపడుదామని అంబత్రయక్షేత్ర శ్రీశ్రీ ఆదిత్యపరాశ్రీ స్వామి అన్నారు. శుక్రవారం బిజ్వార్‌లోని అంబత్రయ క్షేత్రంలో గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ సేవ్ టెంపుల్ ఆర్గనైజేషన్ సనాతన ధర్మ పరిరక్షణ యాత్ర వాల్‌పోస్టర్ ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ సమాజం దేవాలయాలు , దేశ సంస్కృతి, శాస్త్రాలపై అధ్యయనం చేయడం అలవర్చుకోవాలన్నారు. అన్యాక్రాంతమవుతున్న దేవాలయ భూములను పరిరక్షించుకోవాలని, పురాతన దేవాలయాలకు పునర్వైభవం తీసుకురావాలని కోరారు. యాత్ర నేటి నుంచి ఏప్రిల్ 25 వరకు యాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యాత్ర కన్వీనర్ మీసాల లక్ష్మీనివాస్, సుధాకర్, సంపత్, రఘు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఘనస్వాగతం



జడ్చర్లలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు పూలబొకేతో స్వాగతం పలుకుతున్న నిర్వాహకులు

జడ్చర్ల: మండలంలోని పోలేపల్లి సెజ్‌లో ఏర్పాటుచేసిన ఓ ప్రైవేటు పరిశ్రమను శుక్రవారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా పరిశ్రమ నిర్వాహకులు స్పీకర్‌కు ఘనస్వాగతం పలికారు. అనంతరం జడ్చర్లలో ఓ ప్రైవేట్ దంత వైద్య ఆస్పత్రిని కూడా వారు లాంచనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో హమాలీల ఆందోళన



బాదేపల్లి యార్డులో ఆందోళన చేస్తున్న హమాలీలు

కాసేపు ఆగిన పంట దిగుబడుల తూకాలు

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం హమాలీలు ఆందోళన చేశారు. దీంతో కాసేపు పంట దిగుబడుల తూకాలకు అంతరాయం ఏర్పడింది. వెంటనే మార్కెట్‌యార్డు సెక్రటరీ నవీన్ కుమార్, సీఐ ఆదిరెడ్డి హమాలీలతో చర్చించి రైతులకు ఇబ్బందులు కలుగకుండా తూకాలను ప్రారంభించడంతో సమస్య సద్దుమణిగింది. టెండర్లు ఆలస్యంగా రావడంతో తూకాలు వేసేందుకు తమకు సమయం చాలదని, రాత్రివేళలో తాము పనులు చేయబోమని హమాలీలు తూకాలను నిలిపివేసి ఆందోళన చేపట్టారు. ఈ–నామ్ సర్వర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో దేశవ్యాప్తంగా టెండర్ల ధరల ప్రకటనలో ఓగంట ఆలస్యం చోటు చేసుకుందని యార్డు సెక్రటరీ నవీన్ హమాలీలకు నచ్చజెప్పారు. కొందరు హమాలీలు మొండికేయగా రైతులకు ఇబ్బందులు రానీయవద్దని సీఐ, యార్డు సెక్రటరీ విజ్ఞప్తిచేశారు. దీంతో హమాలీలు తమ ఆందోళనను విరమించి తూకాలు చేపట్టారు.

అంతా మనవారే..

జడ్చర్ల: మండలంలోని శిఖర్‌గానిపల్లి గ్రామంలో రేకులు వేసుకొని నివసిస్తున్నది రోహింగ్యాలు కాదని, అంతా మనవారే ఉన్నట్లు పోలీసులు తేల్చి చెప్పారు. శుక్రవారం గ్రామంలో పోలీసులు విచారణ చేపట్టారు. అక్కడున్నది అంతా మనవారే కావడంతో వారు వెనక్కి వచ్చారు. పోలీసులు తెలిపిన వివరాలు.. శిఖర్‌గానిపల్లి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ పొలంలో ఉన్న వారిని రోహింగ్యాలుగా అనుమానించి పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. దీంతో ఎస్పీ జానకి స్పందించి విచారణ చేపట్టాల్సిందిగా ఆదేశించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని విచారించగా వారు హైదరాబాద్‌కు చెందిన వారని సీఐ ఆదిరెడ్డి తెలిపారు. భూమి యజమాని అబ్దుల్లా వచ్చి పనులకోసం తానే వారిని హైదరాబాద్ నుంచి తీసుకువచ్చానని పోలీసులకు వివరించారు. గ్రామస్తులు వారిపట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తుండటంతో వారిని హైదరాబాద్‌కు పంపించనున్నట్లు అబ్దుల్లా పోలీసులకు చెప్పినట్లు తెలిసింది.

● రోహింగ్యాలు కాదని విచారణలో తేల్చిన పోలీసులు

దేశ్‌పాండే ఆధ్వర్యంలో శిక్షణకు సిద్ధం



దేశ్‌పాండే ఫౌండేషన్ చైర్మన్ గురురాజ్ దేశ్‌పాండేతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్‌లో ఒక కేజీబీవీ పాఠశాల, ఒక డిగ్రీ కళశాలలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడానికి దేశ్‌పాండే ఫౌండేషన్ సిద్ధంగా ఉందని, అందుకు గురురాజ్ దేశ్‌పాండే అంగీకరించారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కర్ణాటక రాష్ట్రంలోని హుబ్లీలో దేశ్‌పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన రూరల్ డైలాగ్ కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ గురురాజ్ దేశ్‌పాండేను కలిసి మహబూబ్‌నగర్‌లోని విద్యావ్యవస్థ, విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్న డిజిటల్ కంటెంట్ స్టడీమెటీరియల్, విద్యానిధి, ఫస్ట్ నవరత్నాలు గురించి వివరించారు.

ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో నడవాలి

నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

కోయిల్‌కొండ: ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో నడవాలని నారాయణపేట ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వింజామూర్ గ్రామంలో శ్రీకృష్ణగురు గీత ఆశ్రమంలో 74వ పాదపూజ ఉత్సవంలో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణగురు గీతఆశ్రమాన్ని మరింత అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీఇచ్చారు. భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కొండారెడ్డి, వెంకట్రామిరెడ్డి, హన్మిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నిర్వాహకులు కృష్ణయ్య, రాములు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి



సెర్ప్ సీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న డ్రైవర్స్, హైర్ వెహికిల్స్ అసోసియేషన్ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): డీఆర్‌డీఓ శాఖలో అధికారులకు నడుస్తున్న అద్దెవాహనాలకు చెందిన పెండింగ్ బిల్లును వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఫోర్‌వీలర్స్ డ్రైవర్స్, హైర్ వెహికిల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ కోరారు. ఈమేరకు జిల్లా కేంద్రానికి వచ్చిన సెర్ప్ సీఈఓ దివ్యరాజన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈశాఖలో డీపీఎంలు, ఏపీడీలకు చెందిన ఏడు వాహనాలు నడుస్తున్నాయని, వీటికి సంబంధించిన 12 నెలల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బిల్లులు రాకపోవడంతో మెయింటెనెన్స్ కోసం అప్పులు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు తోట మల్లేష్, సంతోష్, శ్రీనివాస్, రవి, అక్షయ్, రాకేష్, శ్రీను పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించాలి



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: బాలానగర్ బాలికల గురుకుల పాఠశాలలో బాలిక మృతికి కారణమైన ప్రిన్సిపాల్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మరణించిన విద్యార్థిని కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. అంతేకాక జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రివద్ద ఉన్న ఎస్సీ డిగ్రీ గురుకుల ప్రిన్సిపాల్ జయప్రద విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారిని ఇష్టం వచ్చినట్లు తిడుతున్నట్లు ఆరోపించారు. ప్రభుత్వం ఆమెపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు నందు, ఈశ్వర్, బన్ని, సురేష్, హరీష్, మానస పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం

మాలల చైతన్య సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మూలె కేశవులు



మాట్లాడుతున్న మాలల చైతన్య సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మూలె కేశవులు

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణలో కాంగ్రెస్ ప్రభుత్వం మాలలకు తీరని అన్యాయం చేసిందని మాలల చైతన్య సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మూలే కేశవులు ఆవేదన వ్యక్తంచేశారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహ ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2004లో ఎస్సీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు లేదని సుప్రీంకోర్టు తీర్పుఇచ్చిందని, 2024 ఆగస్టు 1న అదే కోర్టు వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు ఉందని తీర్పు ఇవ్వడం చూస్తే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తొత్తులుగా మారినట్లు భావిస్తున్నామన్నారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఎస్సీ వర్గీకరణ చేపట్టిన మాల వ్యతిరేకులకు భవిష్యత్‌లో ఓటు ద్వారా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు యాదయ్య, రాంగోపాల్, చెన్నయ్య, వెంకటస్వామి, తిరుపతయ్య, సుధాకర్, చెన్నకేశవులు, వెంకట్రాములు, యాదగిరి, జి.యాదయ్య, నర్సిములు, రామచంద్రయ్య, దాసు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



అడ్డాకుల: మండలంలోని కాటవరం గ్రామానికి చెందిన శిరీష ఇటీవల హైదరాబాద్‌లో ప్రమాదవశాత్తు దుర్మరణం చెందగా బాధిత కుటుంబాన్ని శుక్రవారం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.రాజశేఖర్ రెడ్డి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. బలీదుపల్లికి చెందిన మాజీ సర్పంచ్ పద్మమ్మ భర్త నర్సింహా, మొగులయ్య ఆటో ప్రమాదంలో గాయపడగా వారిని పరామర్శించి వారికి ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో దయాకర్, భీంరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, శ్రీధర్‌యాదవ్, గణేష్, చంద్రయ్య, భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



కోయిల్‌కొండ: విద్యార్థులు ఎప్పటికప్పుడు చేతులు, కాళ్లు పరిశుభ్రంగా ఉంచుకోవడంతోనే ఆరోగ్యంగా ఉంటారని మండలంలోని ఇబ్రహీంనగర్ ప్రభుత్వపాఠశాల హెచ్‌ఎం నర్సింహులు అన్నారు. శుక్రవారం పాఠశాలలో హ్యాండ్ వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడపడితే అక్కడ చెత్తవేయకుండా పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దీంతో ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండొచ్చన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ కార్యక్రమంపై అవగాహన

జడ్చర్ల టౌన్: నులిపురుగుల నివారణ మాత్రల వాడకంపై శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లు, రీసోర్స్ పర్సన్‌లకు అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యాధికారి డా.మనుప్రియ, ఆర్‌బీఎస్‌కే డాక్టర్ సునీల్ అవగాహన కల్పించారు. ఆల్బెండజోల్ మాత్ర మోతాదు, వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. 1–19 ఏళ్ల వయస్సు మధ్య ఉన్న వారందరికీ అంగన్‌వాడీ కేంద్రంలో మాత్ర వేసేలా చూడాలని వివరించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుగుణ, ఆర్‌పీ సునీత పాల్గొన్నారు.